# నమస్తే తెలంగాణ

## యాదాద్రి భువనగిరి

I హైదరాబాద్, గురువారం 13 జూన్ 2024 | YADADRI BHUVANAGIRI




సమావేశంలో మాట్లాడుతున్న ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి వి.మాధవిలత

## బాలలకు హక్కులను పొందేలా కృషి చేయాలి

- ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి మాధవిలత

భువనగిరి అర్బన్, జూన్ 12: బాలలకు రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులను వారికి అందేలా ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సేవా సంస్థలు కృషి చేయాలని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి వి.మాధవిలత అన్నారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సును బుధవారం భువనగిరి కోర్టు ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ కార్మిక శాఖతోపాటు పలు శాఖలు బాల కార్మికులను గుర్తించి తగిన సమాచారాన్ని పోలీసులకు అందజేయాలన్నారు. బాల సంరక్షణ శాఖ, జిల్లా సంక్షేమ శాఖతో సమన్వయ పరుచుకొని బాల కార్మికులు లేని జిల్లాగా పేరు తేవాలని కోరారు. జాతీయ న్యాయ సేవ అధికార సంస్థ ఏర్పాటు చేసిన చైల్డ్, ఫ్రెండ్లీ, లీగల్ సర్వీసెస్ పథకంలోని అధికారాల ప్రకారం మానిటర్ చేసి న్యాయ సేవ సంస్థ తక్షణ చర్యలు చేపట్టవచ్చని తెలిపారు. జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల నుంచి ఉపాధి కోసం వచ్చిన వారి సమాచారం సంక్షేమ శాఖకు ఇచ్చే విదంగా వివిధ పరిశ్రమల యజమానులకు సూచించామని, కానీ తగిన సమాచారం అందడం లేదన్నారు. ఈ విషయంపై తగిన అవగాహన సదస్సులు, వలస వచ్చిన వారికి, పరిశ్రమల యజమానులకు ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్ శ్రీఅయ్యం గారు పాఠశాలలకు రాని బాలలను గుర్తించి, రిసోర్స్ పర్సన్ ద్వారా చర్యలు తీసుకొని పాఠశాలలో చేరే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. సహాయ కార్మిక శాఖ అధికారి మొయినుద్దీన్ మాట్లాడుతూ ఆపరేషన్ ముస్కాన్ ద్వారా బాల కార్మికులను గుర్తించి కేసులు రిజిస్టర్ చేస్తున్నామన్నారు. ప్యానల్ న్యాయవాదులు న్యాయ సేవ సంస్థకు తగిన న్యాయ సహాయం, సలహాలు అందజేస్తున్నట్లు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు బి.హరినాథ్, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ న్యాయవాదులు ఎస్.జైపాల్, జి.శంకర్ చెప్పారు. కిరాణ, వాణిజ్య, వర్తక, క్లాత్ మర్చంట్స్ సంఘ అధ్యక్షులు మాట్లాడుతూ షాపుల్లో బాలకార్మికులు ఎవ్వరూ పని చేయట్లేదని, ప్రతి షాపు ఎదుట బాల కార్మికులు లేరని బోర్డు కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంక్షేమ అధికారి సైదులు, స్కోప్ ఎన్‌జీఓ అధ్యక్షుడు బండి సాయన్న, హెచ్‌ఆర్‌సీఆర్‌టీఐ శ్యామ్, సభ్యులు శివరాజు, రాంబాయి, వెంకటేశ్ పాల్గొన్నారు.

## అగ్నిపథ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

నీలగిరి, జూన్ 12 : అగ్నిపథ్ పథకం (02/2025)లో భాగంగా భారత వైమానిక దళంలో అగ్ని వీర్వాయుగా చేరడానికి ఆసక్తి కలిగిన అవివాహిత పురుష, స్త్రీ అభ్యర్థులు జూలై 28లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎన్.పద్మ ఒక ప్రకటనలో తెలిపారు. http:agnipathvayu.cdac.in వెబ్‌సైట్‌లో జూలై 3, 2004 నుంచి జనవరి3, 2008 మధ్య జన్మించిన వారు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రవేశ రుసుం రూ.550తోపాటు జీఎస్‌టీ కట్టాలని, దరఖాస్తు చేసుకున్న వారికి అక్టోబర్ 18న ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

## బ్యూటీ, హెల్త్ కేర్‌లో ఉచిత శిక్షణ

నీలగిరి, జూన్ 12 : దుర్గాభాయి మహిళా శిశు వికాస కేంద్రం, మహిళా ప్రాంగణంలో బ్యూటీ, హెల్త్ కేర్ కోర్సులో ఉచిత శిక్షణకు ఆసక్తి కలిగిన వారు ఈ నెల 16లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మేనేజర్ ఎ.అనిత ఒక ప్రకటనలో తెలిపారు. బ్యూటీ, హెల్త్‌కేర్‌కు 8వ తరగతి పాస్ లేదా ఫెయిల్ అయి 18 నుంచి 35 సంవత్సరాల లోపు ఉండాలని, నెల రోజులపాటు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల మహిళా అభ్యర్థినులు జీరాక్స్ కాపీ, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు రెండు, ఆధార్ జిరాక్స్ కాపీలతో నల్లగొండ మహిళా ప్రాంగణంలో ఈ నెల 16 లోపు సంప్రదించాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 7660022517, 08682244416 నంబర్‌లలో సంప్రదించాలని కోరారు.

# రెండు వారాలైతున్నా.. పింఛన్లు రాలే..

ఎలక్షన్లు పూర్తయ్యాక పట్టించుకోని వైనం

ఎదురుచూస్తున్న 1,01,970 మంది పింఛన్‌దారులు

ప్రతి నెలా సుమారు రూ. 30 కోట్లు పంపిణీ

పత్తాలేని కాంగ్రెస్ చేయూత పథకం

ఆరు నెలలైనా రూ.4వేల పింఛన్ ఊసేలేదు

## ఎన్నికలప్పుడు రెండో తేదీనే ఇచ్చిన ప్రభుత్వం

**ప్రభుత్వం ఆసరా పింఛన్లు ఇంకా ఇవ్వలేదు. 12వ తేదీ దాటినా ఇంకా డబ్బులు పంపిణీ చేయలేదు. ఎన్నికల సమయంలో రెండో తేదీనే ఇచ్చిన సర్కారు ఇప్పుడు మాత్రం పట్టించుకోవడం లేదు. నెలలో మొదటి వారంలోనే పింఛన్ ఇవ్వాలని పెన్షన్‌దారులు డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు పెంచిన పింఛన్ ఎప్పుడు ఇస్తారోనని ఆశగా ఎదురుచూస్తున్నారు.**

– యాదాద్రి భువనగిరి, జూన్ 12 (నమస్తే తెలంగాణ)

### 1,01,970 మంది పెన్షనర్లు..

జిల్లాలో మొత్తం 1,01,970 మంది పింఛన్‌దారులు ఉన్నారు. ఇందులో 38,061 వృద్ధాప్యం, 37,574 వితంతు, 13,188 దివ్యాంగులు, 5,861 గీత కార్మికులు, 3,029 నేతకార్మికులు, 522 ఫైలేరియా 105 డయాలసిస్, 2,527 ఒంటరి మహిళలు, 922 మంది బీడి కార్మికులు ఉన్నారు. వీరి కోసం నెలకు సుమారు రూ. 30 కోట్ల వరకు ప్రభుత్వం చెల్లిస్తున్నది. ఈ నెల 12వ తేదీ వచ్చినా ఇంకా పింఛన్ డబ్బులు ఇవ్వలేదు. దాంతో పెన్షనర్లు ఎప్పుడు వస్తుందా అని ఆరా తీస్తున్నారు. డబ్బుల కోసం పోస్ట్ ఆఫీసుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

### ఎన్నికలప్పుడు రెండో తేదీనే..

ఇటీవల పార్లమెంట్ ఎన్నికల సమయంలో ప్రభుత్వం పింఛన్ సకాలంలో జమ చేసింది. ఎలక్షన్స్ ఉండటంతో ఓటర్లను ఆకట్టుకునేందుకు గత నెల రెండో తేదీ నుంచి నాలుగో తేదీ వరకు పింఛన్ డబ్బులు పంపిణీ చేశారు. ప్రస్తుతం ఎన్నికలు లేకపోవడంతో మళ్లీ షరా మామూలే అయ్యింది. మళ్లీ 20 లేదా 25వ తేదీ నుంచి పింఛన్ ఇవ్వనున్నట్లు తెలుస్తున్నది. ఎన్నికలు ఉన్నప్పుడు ఒకలా.. లేనప్పుడు మరోలా సర్కారు వ్యవహరించడం ఏంటని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు.



### రూ. 4,000 పింఛన్ ఎప్పుడో..

కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల ముందు ఆరు గ్యారెంటీలను ప్రకటించింది. అందులో భాగంగా చేయూత పథకం కింద వివిధ రకాల పింఛన్‌దారులకు ఇప్పుడున్న నగదును రూ. 3,016 నుంచి 4,000 పెంచుతామని హామీ ఇచ్చింది. ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు విపరీతంగా ప్రచారం చేసింది. కానీ అధికారంలోకి వచ్చాక దాని ఊసే మరిచిపోయింది. గత ఆరు నెలలుగా నెలకు పాత పింఛనే అమలు చేస్తున్నది. కొత్త పింఛన్ ఎప్పుడు ఇస్తారా అని పెన్షనర్లు ఆశగా ఎదురు చూస్తున్నారు. వెంటనే పెంచిన పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

### ఎన్నికలప్పుడు తొందరగా ఇచ్చిండ్రు



ఎన్నికలప్పుడు పింఛను ఒకటో తారీకు ఇచ్చిండ్రు. ప్రతి సారి ఇలాగే ఇస్తరని అనుకున్నాం. ఈ నెల ఇప్పటివరకు పింఛన్ రాలే. పింఛన్ కోసం ఎదురుచూస్తున్నాం. పోస్ట్ ఆఫీస్ ఆయనను పోయి అడిగినం. ఇంకా రాలేదన్నారు. చాలా ఇబ్బంది అవుతున్నది.

**-పాలాది లక్ష్మమ్మ, వృద్ధురాలు, భూదాన్‌పోచంపల్లి**

### పింఛన్ కోసం ఎదురు చూస్తున్నాం..



సర్కార్ అందిస్తున్న పింఛన్ ఎప్పుడు వస్తదో అని ఎదురు చూస్తు న్నాం. ఎప్పుడు వస్తదో తెలుస్తలేదు. గీ తారీకున ఇస్తారన్న గ్యారెంటీ లేదు. పింఛన్ ఎప్పుడు వస్తదని పంచాయతీ సార్లను అడిగితే ఎప్పుడో ఒకరోజు వస్తది తీయమ్మా అంటూ విస్కుకుంటూ సమాధానం చెప్పి పంపిస్తున్నారు.

**- ఎడ్ల లలిత, పాముకుంట, రాజాపేట మండలం**

### 4వేలు ఇస్తామన్నారు.. 2వేలు కూడా టైమ్‌కి ఇస్తలేరు



ఎన్నికల ముందు కాంగ్రెసోళ్లు నెలకు 4వేల రూపాయల పింఛన్ ఇస్తామని చెప్పిండ్రు. కానీ ఇప్పుడు రూ.2వేల పింఛన్ కూడా టైమ్‌కు ఇస్తలేరు. 12వ తారీఖు దాటినా ఇంకా పింఛన్ రాలే. కేసీఆర్ ఉన్నప్పుడు ప్రతి నెలా సమయానికి ఫించన్ ఇచ్చి ఆదుకునేటోడు. ఇప్పుడైతే ఎప్పుడు వస్తుందో కూడా తెలువడం లేదు.

**- మామిడాల యాదగిరి, ఆత్మకూర్.ఎం**

## రాజకీయ కోణంతోనే అవిశ్వాసం

కోరం లేక డీసీసీబీ సమావేశం వాయిదా

డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

నీలగిరి, జూన్ 12 : రాజకీయ కోణంతోనే తనపై అవిశ్వాసం నోటీసు ఇచ్చినట్లు భావిస్తున్నానని డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి అన్నారు. బుధవారం డీసీసీబీ పాలకవర్గ సమావేశం కోరం లేక వాయిదా పడింది. అనంతరం చైర్మన్ మహేందర్‌రెడ్డి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. తనకు ఇష్టమైన సహకార రంగంలో 1987 నుంచి వివిధ పదవులకు పోటీ చేస్తూ డీసీసీబీ చైర్మన్, రాష్ట్ర ఎస్కాబ్ వైస్ చైర్మన్ స్థాయికి ఎదిగిన మచ్చలేని నాయకుడినన్నారు. 36 సంవత్సరాలపాటు పీఏసీఎస్ చైర్మన్‌గా, 9 సంవత్సరాలు డీసీసీబీ డైరెక్టర్‌గా, 2020 నుంచి డీసీసీబీ చైర్మన్‌గా పని చేస్తున్నానని తెలిపారు. తన అనుభవాన్ని చూసి అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, అప్పటి మంత్రి జగదీశ్‌రెడ్డి బ్యాంకు చైర్మన్‌గా అవకాశం ఇచ్చారన్నారు. 107 సంవత్సరాల చరిత్ర కలిగి నష్టాల బాటలో ఉన్న బ్యాంకును లాభాల్లోకి తెచ్చానని, రూ.900 కోట్ల టర్నోవర్ నుంచి రూ.2,400 కోట్ల టర్నోవర్‌కు బ్యాంకు లావాదేవీలను పెంచానని చెప్పారు. 11 శాతంగా ఉన్న ఎన్‌పీఏను 1.83 శాతానికి తీసుకొచ్చి రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిపామని తెలిపారు. జాతీయ స్థాయిలో ఉత్తమ బ్యాంకు చైర్మన్ అవార్డు తీసుకుని బ్యాంకు ప్రతిష్టను పెంచామని చెప్పారు. రాష్ట్రంలో ఏ సహకార బ్యాంకూ అందించని విధంగా రైతు బిడ్డల విదేశీ విద్య కోసం విద్యా రుణాలు ప్రవేశ పెట్టి 1500 మందికి రూ.118 కోట్ల రుణాలు అందించి రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిపామన్నారు. దీనికి బ్యాంకు వైస్ చైర్మన్, పాలకవర్గ సభ్యులు, ఉద్యోగులు అందించిన సహకారమే కారణమని తెలిపారు. రానున్న ఆరు నెలల్లో బ్యాంకు టర్నోవర్ రూ.3 వేల కోట్లకు తీసుకురావడమే తన లక్ష్యమని తెలిపారు. ఎవరెన్ని కుట్రలు చేసినా అవిశ్వాసం వీగిపోవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో రంగాచారి, ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

# స్కూళ్లు పునఃప్రారంభం

## తొలిరోజు బడిబాట పట్టిన విద్యార్థులు

ప్రభుత్వ పాఠశాలల్లో పుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ

అసౌకర్యాలతో విద్యార్థుల ఇబ్బందులు

భువనగిరి అర్బన్, జూన్ 12 : జిల్లాలోని 712 పాఠశాలలు బుధవారం పునఃప్రారంభమయ్యాయి. మొదటి రోజు పండుగ వాతావరణం కలిగేలా పాఠశాలలను మామిడికొమ్మలు, బెలూన్స్, పూలతో అలంకరించారు. విద్యార్థులను స్వాగతించేందుకు పాఠశాలల్లో డ్రమ్స్ వాయిద్యాలు ఏర్పాటు చేశారు. పాఠశాలల్లో మొదటి రోజు తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి విద్యార్థుల సమస్యలపై చర్చించారు. పాఠశాలలకు చేరిన యూనిఫామ్స్, షూస్, టై, బెల్ట్, పుస్తకాలను అందజేశారు. మొదటి రోజు స్కూళ్ల వద్ద సందడిగా కనిపించింది. తమ పిల్లలను తయారు చేసి లంచ్‌బాక్సు పెట్టడం, ఆటోలు, సైకిళ్లు, బైక్‌లపై తీసుకెళ్లి పాఠశాల దగ్గర దింపడం వంటి పనులతో తల్లిదండ్రులు తీరికలేకుండా గడిపారు. పిల్లలు కూడా ఫస్ట్‌డే కావడంతో ఎంతో ఉత్సాహంతో పాఠశాలకు తరలివెళ్లారు. విద్యార్థులకు పాఠశాలల్లో అన్ని వసతులను ఏర్పాటు చేశారు. కొన్ని పాఠశాలల్లో సమస్యలు స్వాగతం పలికాయి. అమ్మ ఆదర్శ పాఠశాలల కింద చేపట్టిన పనులు పూర్తి కాకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడ్డారు.



బీబీనగర్ మండలం చిన్నరావులపల్లిలో పాఠశాలకు వచ్చిన విద్యార్థులకు పూలు అందజేసి స్వాగతం పలుకుతున్న ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు




ఆలేరు జడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, కలెక్టర్ హనుమంతు జెండగే

## పూర్తికాని అమ్మ ఆదర్శ పాఠశాల పనులు

భూదాన్‌పోచంపల్లి : మండలంలో 27 ప్రభుత్వ స్కూళ్లలో అమ్మ ఆదర్శ పాఠశాల కింద మౌలిక వసతుల పనులు చేపట్టారు. టాయిలెట్స్, మంచినీరు, మైనర్, మేజర్ మరమ్మతులు, విద్యుత్ సరఫరా, పునరుద్ధరణ పనులు మొదలుపెట్టగా ఒక్క పాఠశాలలో కూడా పనులు పూర్తి కాలేదు. ముక్తాపూర్‌లో అసంపూర్తిగా గది నిర్మాణం పనులు కొనసాగుతున్నాయి. బుధవారం పాఠశాలలు ప్రారంభం కాగా సమస్యలతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.




భూదాన్ పోచంపల్లి మండలం ముక్తాపూర్‌లో అసంపూర్తిగా గది నిర్మాణ పనులు

## లక్కారం పాఠశాలలో ఎక్కడి పనులక్కడే..

### విద్యార్థులకు సమస్యల స్వాగతం



చౌటుప్పల్ మున్సిపాలిటీ లక్కారం ప్రాథమిక పాఠశాలలో మరమ్మతులు పూర్తికాని మరుగుదొడ్లు

చౌటుప్పల్ : చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లక్కారం ప్రాథమిక పాఠశాలలో సమస్యలు తిష్ట వేశాయి. స్కూల్ ప్రారంభమైన తొలినాడే విద్యార్థులకు ఇబ్బందులు స్వాగతం పలికాయి. మరుగుదొడ్ల మరమ్మతులు పూర్తి కాకపోవడంతో ఆ పాఠశాల పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అమ్మ ఆదర్శ కమిటీ సమక్షంలో వాటిని పూర్తి చేయాల్సి ఉన్నా పనుల్లో జాప్యం చేయడంతో పూర్తి కాలేదు. వాటికి నీటి సౌకర్యం అందించేందుకు గుంతలు తీసి వదిలేశారు. ఇప్పటివరకు పైపు లైన్ కలిపి గుంత పూడ్చలేదు. దీంతో విద్యార్థులు బయటకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. కనీసం తాగేందుకు మంచీనీరు కూడా లేదు. మధ్యాహ్న భోజనం కూడా వండలేదు. వంట గదికూడా అంతంత మాత్రమే. దినికితోడు పాఠశాల ప్రహరీ గోడ లేక ప్లాస్టిక్ కంచె చుట్టారు. ఇలాంటి పాఠశాలలు చాలానే ఉన్నాయి.

## పాఠశాలలో పొంచి ఉన్న ప్రమాదం

- గుట్ట ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ప్రమాదకరంగా 33కేవీ విద్యుత్ తీగలు



యాదగిరిగుట్ట జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో తేలిన 33కేవీ కరెంట్ వైర్లు

యాదగిరిగుట్ట, జూన్12 : 2024–25 విద్యా సంవత్సరం ప్రారంభమైంది. ప్రభుత్వ పాఠశాలలను బుధవారం ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు పునః ప్రారంభించారు. పలు పాఠశాలల్లో విద్యార్థులకు కావాల్సిన మౌలిక వసతులు అంతంత మాత్రగానే ఉన్నాయి. స్కూల్ పాఠశాలల ఎక్కేందుకు సరైన మెట్ల మార్గం లేకుండా పోయింది. యాదగిరిగుట్ట పట్టణంలోని పాత గోశాల వద్ద గల జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయి. కొండ పైకి విద్యుత్ సరఫరా చేసేందుకు పాఠశాల భవనంలోని వెనుక ప్రాంతంలో 33 కేవీ లైన్ ఏబీ స్విచ్‌లు ఏర్పాటు చేశారు. అండర్ గ్రౌండ్ విద్యుత్ పైపులైన్ వేయగా అందులో కొన్ని విద్యుత్ తీగలు బయటకు వచ్చి ప్రమాదకరంగా మారాయి. ఆదమరిచి అటువైపు విద్యార్థులు వెళ్తే ప్రాణాలు గాలిలో కలిసిపోవడం ఖాయం. పాఠశాలలకు వెళ్లే రోడ్డు మార్గంలో ఇంత జరుగుతున్నా విద్యాశాఖ, విద్యుత్‌శాఖ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. దీనిపై యాదగిరిగుట్ట విద్యుత్ ఏఈ సురేంద్ర నాయుడు వివరణ కోరగా వెంటనే చర్యలు చేపట్టి ప్రమాదాన్ని అరికడతామని చెప్పారు.

పట్టణంలోని బస్టాండ్ ఎదురుగా ఉన్న ప్రాథమిక పాఠశాలతో బీర్ల బాటిళ్లు దర్శనమిచ్చాయి. చదువులు నేర్పే పవిత్ర స్థలంలో మందుబాబులకు అడ్డాగా మారింది. మండల విద్యాధికారి కార్యాలయం సైతం ఇక్కడే ఉండటం గమనార్హం. చదువులమ్మ తల్లిలో మద్యం సేవించడంపై విద్యార్థుల తల్లిదండ్రులు అసహించుకుంటున్నారు. దీనిపై వెంటనే అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



ప్రమాదకరంగా యాదగిరిగుట్టలో జడ్పీ ఉన్నత పాఠశాల దారి